క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 55, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 11, క్యారెట్ 18. దొండ 40, ఆలు 17, ఉల్లి 16, గోకర 55, దోస 35, సార 11, పొట్ల 13, అరటి 11, చిక్కుడు 55, అర్వి 55, మునగ 55, చిలగ డదుంప 40, బీట్‌రూట్ 15, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అనాథ విద్యార్థులకు చేయూతనిద్దాం

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



నిత్యావసరాలను అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

నాగోలు: పేదలకు చేయూతను అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. శుక్రవారం నాగోల్‌లోని లాలన ఫౌండేషన్‌లో న్యాయమూర్తి శ్రీదేవి ఆధ్వర్యంలో బాలికల అనాథ గృహంలో వంట సామగ్రి, నిత్యావసర సరుకులు రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్ బాల్‌రెడ్డి సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ... అనాథ విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అండంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్జీవోస్‌కాలనీ సంక్షేమ సంఘం సమావేశం

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీ నివాసుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 26న ఉదయం 10 గంటలకు కాలనీలోని జలగం వెంగళరావు భవనంలో నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు జి.పేరంటాలయ్య, పి.వి.కె.సోమయాజులు తెలిపారు. బైలాస్ అమెండ్‌మెంట్స్‌పై చర్చించి ఆమోదించడం, కొత్త బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

డీసీపీ రూపేష్‌కు సన్మానం



మలక్‌పేట: ఓల్డ్ మలక్‌పేటకు చెందిన పీస్ కమిటీ నాయకులు గురువారం రాత్రి జరిగిన పీస్, ఆలయ కమిటీ సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్‌ను సన్మానించారు. శ్రీరామనవమి, రంజాన్, హనుమాన్ జయంతి, గుడ్‌ఫ్రైడే పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీసీపీ సూచించారని ఆలయ కమిటీ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నేతలు చౌకి రవికుమార్, డాక్టర్ ఉమారెడ్డి, మదన్‌బాబు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్ హౌస్ అరెస్ట్

సైదాబాద్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమని టీ పీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యాక్రమానికి తరలి వెళ్తున్న ఆయనను శుక్రవారం ఉదయం సైదాబాద్ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన ఇంటి వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవటం సరికాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి నిర్వహించే పరీక్షలను సక్రమంగా జరిపించలేని అధ్వాన స్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణమని ఆయన విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హయత్‌నగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. హయత్‌నగర్ పోలీసుల సమాచారం మేరకు... వనపర్తి జిల్లా పానగల్ మండలం కదిరెపాడుకు చెందిన తురుపాటి గెలవయ్య(30) భార్య ముత్యాలమ్మ ఇద్దరు పిల్లలతో కలిసి కూలిపని చేసుకుంటూ పెద్దఅంబర్‌పేట్‌లోని ఎస్సీ బస్తీలో ఉంటున్నారు. గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో కూలి మాట్లాడుకునేందుకు పెద్దఅంబర్‌పేట్ ఏ1 బేకరీ వద్ద భార్యాభర్తలు జాతీయ రహదారిని దాటుతున్నారు. ఈ క్రమంలో నగరం వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గెలవయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం!

- చెత్తమయమైన శ్రీనగర్ కాలనీ రహదారులు
- డంపింగ్‌యార్డును తలపిస్తున్న వైనం దుర్గంధభరితంగా పరిసరాలు
- పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు



శ్రీనగర్ కాలనీ రహదారిపై డంప్ చేసిన చెత్త

చైతన్యపురి: స్వచ్ఛ హైదరాబాద్, పచ్చదనం పరిశుభ్రత అంటూ అటు ప్రభుత్వం, ఇటు జీహెచ్ఎంసీ అధికారుల ఊకదంపుడు ఉపన్యాసాలు, ప్రకటనలు సర్వ సాధారణమయ్యాయి. చెత్త రహిత కాలనీలుగా తీర్చిదిద్దుతామని ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. కాలనీలు, బస్తీలు చెత్తమయంగా మారి దుర్గంధభరితంగా మారుతుండతమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. చెత్త డంపర్ బిన్‌లు ఉండవని, ఏరోజు సేకరించిన చెత్తను ఆరోజే డంపింగ్ యార్డుకు తరలిస్తామని అధికారులు ప్రకటనలు ఇస్తుంటారు. అవి నోటి మాటలుగానే మిగులుతున్నాయి తప్ప ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ఇక్కడ చెత్త డంప్ చేయకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- గడ్డిఅన్నారం డివిజన్ శ్రీనగర్ కాలనీలోని శ్మశానవాటిక అనుకొని ఉన్న రహదారి చెత్త డంపింగ్ యార్డులా తయారైంది.
- సమీప కాలనీల నుంచి చెత్త ఆటోలు, రిక్షా కార్మికులు ఇళ్లల్లో సేకరించిన ఇక్కడ రహదారిపై డంప్ చేసి వెళ్తుంటారు. తరువాత ప్రత్యేక వాహనంలో ఇక్కడ డంప్ చేసిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు.
- ఎప్పటి చెత్తను అప్పుడే తరలించక పోవటంతో చెత్త రహదారిపై కుప్పలుగా పేరుకుపోతోంది.
- శ్రీనగర్ కాలనీలోని ఈ రహదారి గుండా కోదండరాంనగర్, వీవీనగర్, శారదానగర్ వైపు వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో పరిసర కాలనీల్లో దుర్గంధ భరిత వాతావరణం నెలకొంటోంది. చెత్త కుప్పల వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌సీటీపీ ఏర్పాటుకు కృషి



చెత్తను ఇష్టారాజ్యంగా రహదారులపై వేస్తున్నందున ప్రజలు ఇబ్బందులు, అసౌకర్యానికి గురవుతున్న విషయం వాస్తవమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో గార్బేజ్ సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌పోర్టు పాయింట్ (ఎస్‌సీటీపీ) ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కోరాం. ఇళ్లల్లో సేకరించిన చెత్తను రోడ్లపై డంప్ చేయకుండా నిర్దేశిత ప్రాంతంలో (ఎస్‌సీటీపీ పాయింట్) డంప్ చేసేలా చర్యలు తీసుకుంటాం. అక్కడి చెత్తను ప్రతేక మిషన్ ద్వారా క్రషింగ్ చేసి దుర్వాసన రాకుండా ప్రత్యేక వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఎస్‌సీటీపీ పాయింట్ ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం.

– బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్, గడ్డిఅన్నారం డివిజన్

స్వచ్ఛ ఆటోలను వినియోగించుకోవాలి: కార్పొరేటర్ పవన్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: ప్రజలు ఇష్టారాజ్యంగా చెత్త ఇతర వ్యర్థాలను రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ భరత్‌నగర్ కాలనీ ఫేస్–2లో పర్యటించారు. ఈ సందర్భంగా శానిటైజేషన్ అధికారులతో కలసి కాలనీ పర్యటించి ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను రోడ్లపై వేస్తున్నందున రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, కాలనీలలో రోడ్లన్నీ శుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెత్తను సేకరించే ఆటలలో మాత్రమే తడి, చెత్త చెత్తను వేరుచేసి వేయాలని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ ఎస్ఎఫ్ఏ బుచ్చయ్య, రాంకీ సంస్థ ప్రతినిధి భరత్, సూపర్‌వైజర్లు జవాన్ లక్ష్మయ్య, చిరంజీవి, ప్రేమ్, శివ, అఖిల్, విజయభారతి, బీజేపీ నాయకులు కొర్లపల్లి స్వామి, వెంకటేష్, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తరలింపునకు చర్యలు



వనస్థలిపురం పీఎస్ వద్ద ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పక్క రోడ్డులో పోలీసులు సీజ్ చేసిన వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నెలల కొద్దీ పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోయి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. శుక్రవారం వనస్థలిపురం విచ్చేసిన ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణలో కలసి స్టేషన్ పక్కన, వెనుక వైపు ఉన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లపై సీజ్ చేసిన వాహనాల వల్ల పక్కనే ఉన్న హుడా పార్కుకు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని, ఇదే రోడ్డులో ఏర్పాటు చేసిన మూత్రశాలలు సరైన నిర్వహణ లేక కంపుకొడుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాల తొలగింపునకు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చింతల రవికుమార్, శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, రమణ, ఆనంద్‌రాజ్, సంతోష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల వితరణ

సైదాబాద్: దివ్యాంగుల సంక్షేమానికి అందరూ కృషి చేయాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ సొంత నిధులతో దివ్యాంగులకు సిటీ, డిస్ట్రిక్ బస్‌పాస్‌లు అందజేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. శనివారం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న హనుమాన్ మఠం ప్రాంగణంలో ఈ వితరణ జరుగుతుందని వివరించారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన దివ్యాంగులు రెండేసి చొప్పున సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని కార్పొరేటర్ సూచించారు.

అవగాహనతో టీబీకి చెక్



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి శ్రీకాంతాచారి విగ్రహం మీదుగా బిగ్‌బజార్ వరకు కామినేని నర్సింగ్ విద్యార్థులు శుక్రవారం ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... క్షయ వ్యాధి లేని భారత్ ఏర్పాడాలని, క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో మరింత అవగాహన అవసరమని తెలిపారు. అవగాహన, ముందస్తు జాగ్రత్తలతో టీబీని శాశ్వతంగా భూస్థాపితం చెయొచ్చని ఆయన స్పష్టం చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. క్షయవ్యాధి లేని దేశంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణకుమారి, కామినేని సూపరింటెండెంట్ డాక్టర్ అంజయ్య, డాక్టర్ సుభాకర్, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న రామ్మోహన్‌గౌడ్, లక్ష్మీప్రసన్నగౌడ్

నాగోలు: బండ్లగూడ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర శివపంచాయతన వనం మైసమ్మ నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేడుకలలో బీఆర్‌ఎస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి ముద్దగొని రామ్మోహన్ గౌడ్, బీఎన్‌రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు చెరుకు జంగయ్య గౌడ్, సుర్వి రాజు గౌడ్, మెట్టు రవీందర్ గౌడ్, చెరుకు భవానీ శంకర్ గౌడ్, ఎస్.రాఘవేందర్, కె.రాఘవేందర్, మెట్టు సత్యనారాయణ, సుర్వి శంకరయ్య, చెరుకు శ్రవణ్‌గౌడ్, కందికంటి సాయిగౌడ్, నాగిళ్ల అరవింద్, నాగిళ్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి పలువురి పరామర్శ



నర్సిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: తెలంగణ ఉద్యమకారుడు, కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ చైతన్యపురి మాజీ అధ్యక్షుడు కోతి నర్సిరెడ్డి కూతురు ఉషశ్రీ(20) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారుపు దయానంద్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ముద్దగొని రామ్మోహన్‌గౌడ్ తదితరులు చైతన్యపురిలోని నర్సిరెడ్డి నివాసానికి వెళ్లి ఉషశ్రీ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నర్సిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్‌రెడ్డి, రమణారెడ్డి, డివిజన్ నేతలు తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి, రాపోలు సుధాకర్ కడియం మోహన్ పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉషశ్రీక నివాళులర్పించారు.

మంత్రి కేటీఆర్, జనార్దన్‌రెడ్డిపై ఫిర్యాదు

నాగోలు: టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో మంత్రి కేటీఆర్, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డిని కలసి మంత్రి కేటీఆర్, జనార్దన్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... మంత్రి కేటీఆర్ టీఎస్‌పీసీసీ లీకేజీలపై మాట్లాడుతూ ఇద్దరే కారణమని చెప్పి కేసును పక్కదారి పట్టించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు శ్రీనాథ్‌రావు, రోహిత్, ప్రవీణ్‌రెడ్డి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

హస్తినాపురం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వ రద్దు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో బ్లాక్ డే వంటిదని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి, టీ పీసీసీ డెలిగేట్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి సాగర్‌రింగ్ రోడ్డులో ప్రధాని నరేంద్రమోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... విపక్ష నేతలపై సీబీఐ, ఈడీ లాంటి సంస్థలచే దాడులే కాకుండా అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను వాడుకోవడం సరికాదన్నారు. కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్, నేతలు మిద్దెల జితేందర్, బుడ్డ సత్యనారాయణ, మల్లారపు శ్రీనివాసరావు, రమేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లింగాల కిషోర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

రాజకీయ కుట్ర: దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం రాజకీయ కుట్రలో భాగమని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. పధాని నరేంద్ర మోదీ కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణలో సమస్యలను పరిష్కరిస్తాం

- వివిధ సమస్యలపై లబ్ధిదారులతో చర్చ
- కనీసం ఒక్క వాయిదా అయినా చెల్లించండి
- నోటీసులకు స్పందించకుంటే చర్యలు తథ్యం
- ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటాచారి

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకొచ్చిన జీఓ 59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి అన్నారు. హయత్‌నగర్ మండల పరిధిలో జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చిన ప్రకారం రుసుము చెల్లించక పోవడంతో వారి సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం ఆయన తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి హయత్‌నగర్ తాహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశం అయ్యారు. జీఓ ప్రకారం కాకుండా మా ఇళ్లకు ఇష్టానుసారంగా డబ్బులు కట్టాలని నోటీసులు ఇచ్చారని, ఒకే సర్వే నెంబర్‌లో ఉన్న ఇళ్కకు రకరకాలుగా రుసుము చెల్లించాలని, 60 గజాల ఇళ్లకు కూడా లక్షలాది రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారని లబ్ధిదారులు ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు ఇచ్చిన నోటీసులు ప్రకారం చెల్లించాలంటే ఇళ్లను అమ్మేసినా అన్ని డబ్బులు రావని జీఓలో సూచించినట్లు మార్కెట్ రేటు ప్రకారం లెక్క చేసి నోటీసులు ఇవ్వాలని వారు కోరారు. కొన్ని సర్వే నెంబర్లలోని విలువైన భూమిని 118 జీఓ ప్రకారం రూ. 250కి గజం చొప్పున రెగ్యులరైజేషన్ చేస్తున్న అధికారులు స్లమ్ ఏరియాలో నివసించే తమకు గజానికి వేల రూపాయలు కట్టాలని నోటీసులు ఇవ్వడం దారుణమని వాపోయారు.

ఒక్క వాయిదా అయినా చెల్లించండి...

క్రమబద్ధీకరణకు మూడు విడతల్లో డబ్బులు కట్టాల్సి ఉందని అయితే ప్రస్తుతం ఒక విడత డబ్బులైనా చెల్లిస్తే వారికి ఎదురైన సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీఓ వెంకటాచారి తెలిపారు. ఎలాంటి రుసుమును చెల్లించకుండా సమస్యలు పరిష్కరించలేమని ఈ సంద్భంగా ఆయన స్పష్టం చేశారు. ఆయా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నోటీసులకు స్పందించకుంటే ఆక్రమణదారులుగా భావించి చట్టపరమైన చర్యలు తీసుకోల్సి వస్తుందని ఆర్డీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు నర్సింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన



వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లెనిన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్‌అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మలక్‌పేట: యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. తద్వారా ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవచ్చని న్యూ నోబుల్ డిగ్రీ కాలేజ్ ఇన్‌చార్జి గౌని చంద్రయ్యగౌడ్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కాలేజ్‌లో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ జాబ్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం జాబ్ మేళా ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన 100 మందికి ఆఫర్ లెటర్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. విప్రో, హెడీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, టీఎస్‌వీ ఇంజినీరింగ్, వైటీఎస్, హెచ్‌ఆర్‌హెచ్ తదితర మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రేమలత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆఫర్ లెటర్‌ను అందజేస్తున్న కంపెనీ ప్రతినిధి

సీపీఆర్‌పై ట్రాఫిక్ పోలీసులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నాగోలు: రోడ్డు ప్రమాదాల్లో ప్రయాణికుల తలకు గాయాలైనప్పుడు, గుండెపోటుకు గురైన సంఘటనలను సీపీఆర్‌పై శిక్షణ పొంది అవగాహన కలిగి ఉన్న పోలీసులే ఎన్నో ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ జోసఫ్ అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ సిబ్బందికి ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ వైద్యుల సహకారంతో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ అందించడం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావ్య రాథోడ్, సుప్రియ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘సొంత నిధులతో రోడ్డు మరమ్మతు’



గాయత్రీనగర్ ఫేజ్–4లో రోడ్డును బాగుచేయించుకుంటున్న దృశ్యం

వనస్థలిపురం: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా ఆ కాలనీవాసులంతా ఏకతాటిపైకొచ్చి తమ సమస్యను తామే పరిష్కరించుకునేందుకు శ్రీకారం చుట్టారు. వివరాలివీ... బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రీనగర్ ఫేజ్–4లో గాయత్రీనగర్ కమాన్ మెయిన్ అప్రోచ్ రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కాలనీవాసులు తమ సొంత నిధులు రూ. లక్ష వెచ్చించి జేసీబీతో రోడ్డును చదును చేయించుకున్నారు. మెయిన్ రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారు కావడంతో కాలనీ సభ్యుల సహకారంతో రోడ్డు మరమ్మతులు చేపట్టినట్లు కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి మనోజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలాంత్రపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యజ్ఞమూర్తి రవికిరణ్, సహాయ కార్యదర్శి సాదుల వెంకటేష్, కోశాధికారి లక్కరాజు అర్జున్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయండి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ శనివారం ఇందిరాపార్కు వద్ద చేపడుతున్న నిరుద్యోగ మహాధర్నాను నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్సీ లీకేజీలపై ప్రశ్నిస్తే నోటీసులు పంపి అరెస్టులు చేయటం అప్రజాస్వామికమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్‌తోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ఆయన గుర్తుచేశారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, కేబినేట్ నుంచి కేసీఆర్ కుమారుడు కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీస్సీ పరీక్షలు రాసిన నిరుద్యోగులకు రూ. లక్ష చొప్పున పరిహారం ప్రకటించాలన్నారు. యువతను వంచిస్తున్న కేసీఆర్ సర్కార్ మెడలు వంచి, మన కొలువులు మనం సాధించుకుందామని పిలుపునిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే మా నౌకరీలు మాగ్గావాలే నిరుద్యోగ మహాధర్నాలో ప్రతి నిరుద్యోగి పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సూరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జీహెచ్ఎంసీ నిధులతో చేపట్టిన మెగా జాబ్‌మేళాలో పాల్గొన్న నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించారని విమర్శించారు. జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులకు కనీసం తాగు నీరు అందించలేదని మండిపడ్డారు. నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎంజాల జగన్, కడారి యాదగిరియాదవ్, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.